

డీసీసీబీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలక వర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కోలా గురువులు చైర్మన్‌గా ఆరు నెలల క్రితం నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ కాలపరిమితి ఈనెల 17వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో కమిటీ కాల పరిమితిని ఈనెల 18 నుంచి జూలై 17వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది జూలైలో గురువులతో పాటు మరో ఆరుగురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

అన్నదాతపై చిన్నచూపు

పంట నష్ట పరిహారం కోసం బాధిత రైతులు నిరీక్షణ

- మిచౌంగ్ తుఫాన్‌తో వేలాది ఎకరాల్లో పంటలకు తీవ్రనష్టం
- క్షేత్రస్థాయిలో రెండుసార్లు సర్వే చేసిన అధికారులు
- '33 శాతం' నిబంధన పేరుతో భారీగా తగ్గింపు
- 16,472 ఎకరాల్లో వరి, 540 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం
- నెల క్రితమే ప్రభుత్వానికి నివేదికలు
- ఇంతవరకు పరిహారం సొమ్ము విడుదలకాని వైనం



దేవరాపల్లి మండలం చిననందిపల్లిలో నీటిపై తేలుతున్న వరి పనలు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత నెలలో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో వివిధ రకాల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. నిబంధనల పేరుతో పంటనష్టం మదింపులో భారీ కోత వేసిన ప్రభుత్వం.. బాధిత రైతులకు ఇచ్చే అరకొర నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నది.

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో వరితోపాటు చెరకు, మిర్చి, పలురకాల ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నేల వాలి నీటమునిగాయి. రోజుల తరబడి ముంపులో వుండడంతో వరి పైరు కుళ్లిపోయింది. అప్పటికే ఎకరాకు రూ.20-25 వేల వరకు పెట్టుబడి అయ్యింది. ఒక్క ధాన్యం గింజ కూడా చేతికి రాకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ ఏఏవోలు, రెవెన్యూ సిబ్బంది రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. తొలుత 32 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు, రెండోసారి సర్వేలో 16,472 ఎకరాల్లో మాత్రమే వరి పంటకు నష్టం జరిగినట్టు ప్రభుత్వానికి నివేదించారు. నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితేనే పరిగణలోకి తీసుకున్నారు. ఇది కూడా రైతును యూనిట్‌గా తీసుకోకుండా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో పలు గ్రామాల్లో 33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టపోయిన రైతుల పేర్లు జాబితాల్లో చేర్చలేదు. మొత్తం 27,956 మంది రైతులు నష్టపోయారని, వీరికి రూ.112 కోట్లు పరిహారం చెల్లించాలని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా చెరకు, కూరగాయలు, అరటి, బొప్పాయి, తమలపాకు, మిరప, తదితర పంటలు సుమారు 540 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రభుత్వానికి నివేదించారు. ఇది జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్నప్పటికీ నష్టపరిహారం చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు వెలువడలేదు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందితే రబీ పంటలకు పెట్టుబడికి అందివస్తుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. ఇదిలావుండగా మిచౌంగ్ తుఫాన్, భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపుపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. పంట నష్టం అంచనాలు తయారు చేసి గత నెలలోనే ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో పరిహారం చెల్లింపులు జరుగుతాయన్నారు. సంక్రాంతి తరువాత పంట నష్టపరిహారం సొమ్ము బాధిత రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అయ్యే అవకాశం వుందని తెలిపారు.



నక్కపల్లి మండలంలో నీటి మునిగిన కూరగాయల పంట (ఫైల్ ఫొటో)



వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులు

20న వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల జాతర

అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల జాతర మహోత్సవం ఈ నెల 20వ తేదీన జరగనున్నది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, ప్రతినిధులు శుక్రవారం వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు ప్రారంభించినట్టు వెల్లడించారు. - వార్త 7వ పేజీలో

జనావాసాల మధ్య మద్యం దుకాణం

ఉదయం నుంచి రాత్రి వరకు ఓపెన్ బార్‌గా వీధులు

- ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తున్న మందుబాబులు
- ఒక పక్క మహాత్మా గాంధీ విగ్రహం, మరో పక్క గౌరమ్మ గుడి.. సమీపంలో బాలికల హాస్టల్
- చీకటిపడితే ఇటుగా రాకపోకలకు భయపడుతున్న మహిళలు, యువతులు, విద్యార్థినులు
- తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న స్థానికులు
- మద్యం షాపును తరలించాలన్న వినతిని పట్టించుకోని అధికారులు



చోడవరం చిన్నబజారు వీధిలో గాంధీ బొమ్మ సెంటర్. సర్కిల్‌లో కనిపిస్తున్నదే మద్యం షాపు



ప్రభుత్వ మద్యం దుకాణం ఇదే

చోడవరం, జనవరి 12 :

ఒక పక్క జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం. మరో పక్క గౌరమ్మ గుడి. చుట్టూ నివాసాలు. కొద్దిదూరంలో బాలికల హాస్టల్ వుంది. రోజూ బాలికలు పాఠశాలకు ఈ మార్గంలో నుంచి వెళ్లివస్తుంటారు. గాంధీబొమ్మ సెంటర్‌గా స్థానికులు పిలుచుకుంటుంటారు. నిత్యం రద్దీగా వుండే ఈ ప్రదేశంలో అధికారులు మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. షాపు వద్ద, పరిసరాల్లో మందుబాబులు మద్యం సేవిస్తుంటారు. వీరికి చీకులు, ఇతర స్టఫ్ అందించేందుకు చిన్నపాటి దుకాణాలు. మొత్తం మీద ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు మందుబాబులు హడావుడి చేస్తుంటారు. ఇదీ పట్టణంలోని చినబజారువీధిలో వున్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద పరిస్థితి. చోడవరం నుంచి దేవరాపల్లి వెళ్లేందుకు ప్రధాన రహదారి కూడా ఇదే కావడంతో పాటు, ఇరుకుసందులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల స్థానికులతోపాటు, ఈ దారిలో రాకపోకలు సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతుతున్నారు. ముఖ్యంగా మహిళలు, యువతలు చీకటి పడిన తరువాత ఈ రోడ్డు వెంట ... మిగతా 8వ పేజీలో

మద్యం దుకాణాన్ని మూసివేయాలి



మద్యపానాన్ని పూర్తిగా నిషేధించిన తరువాత వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని ప్రస్తుత పాలకులు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. మరో రెండు మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. మద్యనిషేధం మాత్రం అమలు చేయలేదు. పైగా నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. చోడవరం చినబజారువీధిలో నడుపుతున్న మద్యం దుకాణం వల్ల మహిళలు, యువతులు, పాఠశాలకు వెళ్లే బాలికలు తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. ప్రభుత్వం చోద్యం చూస్తుండడం సిగ్గుచేటు. రోడ్డుపై మందుబాటిళ్లతో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నా పోలీసుల పట్టించుకోవడంలేదు. తక్షణమే చినబజారువీధిలోని మద్యం దుకాణాన్ని మూసివేయాలి.

పుల్లేటి గణేశ్,
సామాజిక కార్యకర్త, చోడవరం

హత్యకు దారితీసిన స్వల్ప వివాదం

పెదరాంభద్రపురంలో ఇరువర్గాల మధ్య కొట్లాట

- సర్దుబాటు చేసి శాంతింపజేసిన పెద్దలు
- కొద్దిసేపటి తరువాత ఒక వర్గానికి చెందిన వ్యక్తిపై కర్రలు, రాడ్లుతో దాడి
- తీవ్రంగా గాయపడడంతో మృతి



దాడిలో గాయపడిన బాధితులు

పాయకరావుపేట రూరల్, జనవరి 12:



గంపల నూకరాజు (ఫైల్‌ఫొటో)

మండలంలోని పెదరాంభద్రపురం గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన స్వల్ప వివాదం కాస్తా ముదిరి.. ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. ఇది సమసిపోయిన తరువాత ఒక వర్గానికి చెందిన వ్యక్తిపై, మరో వర్గం వారు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పెదరాంభద్రపురం ఎస్సీ కాలనీ సెంటర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వుంది. కాలనీకి చెందిన శీలి నూకరాజు గురువారం సాయంత్రం పాదరక్షలతో విగ్రహం గట్టుమీదకు ఎక్కగా, అక్కడే వున్న గంపల నూకరాజు(43) వారించాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇరువర్గాల వారు చేరుకుని ఘర్షణపడ్డారు. స్థానిక పెద్దలు సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే గంపల నూకరాజుపై శీలి నూకరాజు మనసులో కక్షపెంచుకుని శీలి సూరిబాబు కలిసి పాయకరావుపేట నుంచి కొంతమందిని గ్రామానికి తీసుకువచ్చాడు. రాత్రి 8.30 గంటల సమయంలో గంపల వీరబాబు ఇంటి వద్ద అతనితో మాట్లాడుతున్న గంపల నూకరాజుపై శీలి నూకరాజు, అతని మనుషులు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి నేలపై కుప్పకూలిపోయాడు. గంపల వీరబాబు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆపడానికి ప్రయత్నించగా శీలి నూకరాజు మనుషులు వారిపై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గంపల నూకరాజుని తుని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హతుడి సోదరుడు గంపల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. మృతుడు నూకరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

షుగర్ పెరుగుతోంది



కొవిడ్ తరువాత భారీగా పెరిగిన డయాబెటిస్ బాధితులు

- కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగంలో వారానికి మూడు రోజులు ఓపీ
- ఒక్కోరోజు 400 మంది వరకూ రాక
- అందులో కొత్తవారు సుమారు 80 మంది
- యుక్త వయస్కుల్లోనూ సమస్య
- ప్రతి వంద మందిలో 62 మంది మహిళలు.. 38 మంది పురుషులు
- ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడమే కారణం

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): షుగర్ బారినపడుతున్న వారి సంఖ్య గడిచిన కొన్నాళ్లుగా బాగా పెరుగుతోంది. ముఖ్యంగా కొవిడ్ తరువాత కేసులు గణనీయంగా పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లోని ఎండో క్రైనాలజీ విభాగం ఓపీకి ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం 20 శాతం మేర రోగులు పెరిగినట్టు పేర్కొంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తికి ముందు, తరువాత చాలా వ్యత్యాసం కనిపిస్తోందంటున్నారు. కేజీహెచ్‌లో ఎండో క్రైనాలజీ విభాగంలో మంగళ, గురు, శనివారాల్లో ఓపీ సేవలు అందిస్తుంటారు. ఆయా రోజుల్లో షుగర్ బాధితులు సుమారు 450 మంది చొప్పున వస్తున్నారు. వీరిలో కొత్తగా వచ్చేవారి సంఖ్య 70-80 వరకు ఉంటుంది. మొత్తంలో 25-30 ఏళ్ల వయస్కులు పది మంది, 30-35 ఏళ్ల మధ్యవారు పది నుంచి 15 మంది వరకూ ఉంటున్నారు. 35 ఏళ్లు పైబడిన వాళ్లు 40 నుంచి 55 మంది ఉంటున్నారు.

యుక్త వయస్కుల్లో పెరుగుదల

గతంతో పోలిస్తే యుక్త వయస్కుల్లో షుగర్ సమస్య పెరుగుతోంది. గతంలో 35 ఏళ్లలోపు వందలో ఇద్దరు, ముగ్గురికి మాత్రమే షుగర్ కనిపించేది. ప్రస్తుతం ఆ సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ప్రతి వంద కొత్త కేసుల్లో కనీసం 15 నుంచి 20 మంది 30 ఏళ్లలోపు వారు ఉంటున్నారు. అదే 40 ఏళ్లలోపు వాళ్లు అయితే 40 శాతం ఉంటున్నారు. షుగర్ బాధితుల్లో 20 శాతం మందికి ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తోంది. మిగిలినవాళ్లు టాబ్లెట్లతో నియంత్రణలో ఉంచుకుంటున్నారు. ఇన్సులిన్ ఇవ్వాల్సి వస్తున్న ప్రతి పది మందిలో ఒకరు 30 ఏళ్లలోపు వాళ్లు ఉండడం గమనార్హం. ఇకపోతే, కేజీహెచ్‌కు వచ్చే షుగర్ బాధితులను పరిశీలిస్తే మహిళలు అధికంగా ఉంటున్నారు. వంద మందిలో 62 మంది మహిళలు ఉంటే, 38 మంది పురుషులు ఉంటున్నారు. పురుషులతో ... మిగతా 8వ పేజీలో

జూదాలపై ఉక్కుపాదం

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం

- సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట, బల్లాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ కేవీ మురళీకృష్ణ



కేవీ.మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ

అనకాపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, బల్లాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సులభంగా డబ్బు సంపాదించవచ్చనే దురాశతో కొంతమంది పలు రకాల జూదాలు ఆడుతున్నారని చెప్పారు. డబ్బులు పోగొట్టుకుంటున్న వారికి, జూదాల నిర్వాహకుల మధ్య గొడవలు జరిగి శాంతి భద్రతల సమస్యలు తలెత్తున్నాయని అన్నారు. అంతేకాక జూదాల కారణంగా కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయని, అందువల్ల జిల్లాలో కోడిపందేలు, పేకాట, బల్లాటలు వంటివి నిర్వహించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో వివిధ రకాల జూదాలు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడినవారు మళ్లీ వాటి జోలికి వెళ్లకుండా బైండోవర్ చేస్తామన్నారు. గత అనుభవాల దృష్ట్యా కోడిపందేలు, పేకాట, బల్లాటలు నిర్వహించే ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రైవేటు స్థలాల్లో జూదాల నిర్వహణకు అనుమతిస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అశ్లీల నృత్యాల ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిస్తే.. వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదంటూ 100, 112 నంబర్లకు ఫోన్‌చేసి చెప్పాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామతామని ఎస్పీ తెలిపారు.



అనకాపల్లి దీక్ష శిబిరంలో అంగన్‌వాడీలు

32వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

'జగనన్నకు చెబుదాం' అంటూ సంతకాల సేకరణ

గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. అన్ని కేంద్రాల్లో ధర్నా శిబిరాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. తమ సమస్యలపై 'జగనన్నకు చెబుదాం' అంటూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అంతటా అంగన్‌వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. కోటవురట్లలో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని 32 రోజులుగా చేస్తున్న సమ్మెను అణచివేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని అన్నారు. తమ సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా ఉత్తర్వులను భోగి మంటల్లో వేసి దహనం చేస్తామని హెచ్చరించారు. -అనకాపల్లి



అనకాపల్లిలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఒక వస్త్ర దుకాణం

అనకాపల్లికి సంక్రాంతి శోభ

- కిటకిటలాడిన వ్యాపార సముదాయాలు
- సందడిగా రహదారులు

అనకాపల్లి టౌన్, జనవరి 12: సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో అనకాపల్లిలోని పలు రకాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడు తున్నాయి. గత రెండు రోజుల నుంచి స్థానికులతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు షాపింగ్‌కు తరలి వస్తున్నారు. షాపింగ్ మాల్స్, రెడీమేడ్ దుస్తులు, వస్త్రాల దుకాణాలు, బంగారం షాపులు, గృహోపకరణాలు, కిరాణా దుకాణాల్లో ఎక్కువ రద్దీ నెలకొంది. కొనుగోలు దారుల్లో మహిళలు, యువతులు అధికంగా వున్నారు. సంక్రాంతికి పలు రకాల వస్తువులు, సామగ్రి కొనుగోలుదారులుకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో ప్రధాన రహదారులు రద్దీగా మారాయి.



మెయిన్ రోడ్డులో కొనుగోలుదారుల సందడి

క్రైం... crime news

లారీ ఢీకొని ఇద్దరి మృతి

» పండక్కి ఇంటికి వెళుతుండగా కబళించిన మృత్యువు

విశాఖపట్నం, జనవరి 12: పండక్కి సొంతూరు బయలుదేరిన ఇద్దరిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఇందుకు సంబంధించి ఆరిలోవ ట్రాఫిక్ ఎస్.ఐ.శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీకి చెందిన కూర్మనాథపురం మీనా (30), అదే ప్రాంతంలో గల బంజీరపేట గ్రామానికి చెందిన జెన్న లోకనాథం (25) ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. ప్రస్తుతం చినగదిలి హెల్త్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనంలో పనిచేస్తున్నారు. పండుగకని శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై స్వస్థలానికి బయలుదేరారు. అయితే వీరి వాహనాన్ని జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో లారీ ఢీకొంది. దీంతో మీనా, లోకనాథం ఇద్దరూ వాహనం పైనుంచి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల కుటుంబాలకు పోలీసులు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం


దుంగ కనకరాజు(ఫైల్)

సబ్బవరం, జనవరి 12: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులో గాలిభీమవరం జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందారు. మరొక్కరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొటివాడకు చెందిన దుంగ కనకరాజు(45) ఆటోపై గురువారం రాత్రి చోడవరం వైపు నుంచి సబ్బవరం వైపు బట్టలు లోడుతో వస్తున్నాడు. గాలిభీమవరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి బైక్ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో అదుపు తప్పడంతో డ్రైవర్ కనకరాజు రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు కుమార్తెలు భవానీ, కళ్యాణి, సాధన ఉన్నారు. జీవనాధారం కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నాగేశ్వరరావు

కోటవురట్ల, జవనరి 12: మండలంలోని కొత్తగొట్టివాడలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తగొట్టివాడ గ్రామానికి చెందిన రాచపతి నాగేశ్వరరావు(42) శుక్రవారం గ్రామ సమీపంలో గల పశువుల పాకలో విద్యుత్ హోల్డర్‌కు బల్బు అమరుస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు హుటాహుటిన కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నాగేశ్వరరావుకు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమార్తెలు మేఘన, వసుంధర ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. మృతదేహన్ని కోటవురట్ల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

పట్టుబడ్డ కోళ్ల దొంగలు

సబ్బవరం, జనవరి 12: మండలంలోని ఆరిపాకలో ఈనెల పదో తేదీన ఆరు డింకీ కోడి పుంజులు అపహరించిన ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులను సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిపాకలో పిన్నంరాజు రామకృష్ణ కొన్నేళ్లుగా డింకీ కోళ్లు మేపుతున్నారు. ఒక్కో కోడిపుంజు విలువ రూ.60 వేలు నుంచి రూ.80 వేలు ఉంటుంది. ఈనెల 10వ తేదీన గుర్తు తెలియని దొంగలు ఆరు కోడి పుంజులను ఎత్తుకుపోయారు. సోమవారం రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే గతంలో లగిశెట్టిపాలెం, ఆరిపాక, టెక్కలిపాలెం, రాయపురఅగ్రహారం తదితర గ్రామాల్లో చిల్లర దొంగతనాలకు పాల్పడ్డ కొంతమందిని అప్పట్లో పోలీసులు గుర్తించారు. వారిపై అనుమానించిన పోలీసులు విజయనగరం జిల్లా కొత్తవలసలో శనివారం గంటా జార్జి, గంటా విలియంలను విచారించారు. వారి వద్ద నుంచి ఆరు కోడి పుంజులను స్వాధీనం చేసుకొన్నారు. వారిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టుకు తరలించారు. మరొకరిని పట్టుకోవలసి ఉందని సీఐ రమణ తెలిపారు.

70 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

మాడుగుల రూరల్, జనవరి 12 : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి చోడవరం వైపు వస్తున్న కారులో 70 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం ముకుందపురం పెట్రోల్ బంకు సమీపంలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో పాడేరు నుంచి చోడవరం వైపునకు వస్తున్న కారును ఆపి పరిశీలించగా, అందులో అదే జిల్లా ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు గ్రామానికి చెందిన జె.జగన్నాథం గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతనిని అరెస్టు చేసి, కారు సీజ్ చేశామన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో డీబీపీ పోటీ


దాసరి అన్నపూర్ణ

పాయకరావుపేట, జనవరి 12: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాలకు దళిత బహుజన పార్టీ(డీబీపీ) తరపున అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ ప్రకటించారు. శుక్రవారం పాయకరావుపేటలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బహుజనులకు ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రక్షణ ఉండాలంటే రాజ్యాధికారం సాధన ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ డీబీపీ తరపున అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఫిబ్రవరి 5న అభ్యర్థుల తుది జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటిస్తారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో డీబీపీ తరపున అభ్యర్థి పోటీలో ఉంటారని ఆమె తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఇళ్లకు వెళ్లి బెదిరిస్తారా?

» ఎమ్మెల్యే చెపితే అరెస్టు చేస్తారా..?
» పోలీసు వ్యవస్థను జగన్ బానిసను చేసి వాడుకుంటున్నారు
» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆగ్రహం


పట్టణ పోలీసులతో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 12: సోషల్ మీడియాలో పోస్టు పెడితే రాత్రి సమయంలో ఇళ్లకు వెళ్లి ఆడవాళ్లను బెదిరించి, దౌర్జన్యం చేస్తారా.. అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోలీసులను ప్రశ్నించారు. ఈ అంశంపై శుక్రవారం సీఐ గణేశ్‌తో మాట్లాడేందుకు కార్యకర్తలతో కలిసి ఆయన నర్సీపట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సీఐ పాయకరావుపేట వెళ్లారని సిబ్బంది చెప్పడంతో అయ్యన్న అసహనం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వస్తున్నట్టు సీఐకి ముందుగా సమాచారం ఇచ్చినా లెక్క చేయకుండా వెళ్లిపోవడం ఏమిటన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిమిరెడ్డి తాతాజీ, బంగారు కొండ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలపై గురువారం రాత్రి 10 గంటల సమయంలో వారి ఇళ్లకు పోలీసులు వెళ్లి స్టేషన్‌కు రమ్మని బెదిరించారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థను బానిసను చేసి వాడుకుంటున్నారని విమర్శించారు. ఐపీఎస్‌లు కూడా అదే విధంగా తయారయ్యారని వాపోయారు. ఇన్ని జరుగుతున్నా పోలీసులు కేసులు పెడతారని భయపడి మేధావులు మాట్లాడడం లేదన్నారు. ఎమ్మెల్యే చెప్పారని సోషల్ మీడియాలో పోస్టు పెడితే అరెస్టు చేస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల డబ్బులతో జీతాలు తీసుకుంటూ వారికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఈ దౌర్జన్యం ఏమిటని పోలీసులనుద్దేశించి అన్నారు. నాతవరంలో రెండేళ్ల క్రితం కల్యాణ్ అనే కుర్రాడిని కాళ్లు చేతులు కట్టేసి కాలువలో పడేసి చంపేశారని ఆరోపించారు. ఈ కేసు ఏం చేశారని ప్రశ్నించారు. రెండేళ్లు గడుస్తున్నా ఎవరు చేశారో గుర్తించలేకపోయారా... అని ప్రశ్నించారు. గొలుగొండ టీడీపీ నాయకుడు నానిబాబును పప్పుశెట్టిపాలెంలో నాయుడు అనే వ్యక్తి బూతులు తిట్టాడని ఏడాది క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వైసీపీ నాయకులు గుడివాడ నాని, అనిల్, అంబటి రాంబాబు బూతులు మాట్లాడుతుంటే పోలీసులు ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వం అని, మీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోండని పోలీసులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, 25వ వార్డు కౌన్సిలర్ రాజేశ్‌లతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు యువత పట్టుదలతో చదవాలి

» నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
» లోక్నో సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యనారాయణ


వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏడీజీ సత్యనారాయణ

నర్సీపట్నం, జనవరి 12: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యనారాయణ వెల్లడించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రాంతి లేకుండా కష్టపడి చదవాలని యువతరానికి సూచించారు. అభిరుచికి తగ్గ కోర్సు ఎంపిక చేసుకోవాలన్నారు. ఐఏఎస్‌కు ఎంపికైన నర్సీపట్టణానికి చెందిన మౌర్య చాలా పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారిణి దమయంతి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు లేఅవుట్‌కు రహస్యంగా రోడ్డు

» పనులను అడ్డుకున్న స్థానికులు



రాత్రి పనులు చేస్తున్న కూలీలు... రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు

కొత్తూరు, జనవరి 12: మేజర్ పంచాయతీ కొత్తూరు, రామాపురం కాలనీ నుంచి పిసినికాడ పంచాయతీ పరిధిలోని ప్రైవేటు లేఅవుట్‌కు వైసీపీ నేతలు వేయిస్తున్న రహదారి పనులను స్థానికులు, రైతులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. ప్రైవేటు లేఅవుట్‌కు కొందరి రైతుల జిరాయితీ, ప్రభుత్వ స్థలాల మీదుగా వైసీపీ నేతలు రోడ్డు వేస్తున్నారని తెలియడంతో స్థలాల యజమానులు, స్థానికులు పనులను అడ్డుకొని, అక్కడున్న కాంట్రాక్టుదారున్ని నిలదీశారు. ఎటువంటి గ్రామసభ తీర్మానం లేకుండా లేఅవుట్‌లోకి వెళ్లేందుకు అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

దీంతో కాంట్రాక్టర్ సూరిబాబు పొంతన లేని సమాధానం చెప్పడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సర్వే నంబరు 47/3/సీలో తమకు చెందిన సొంత స్థలాల్లో రాత్రికి రాత్రే రహస్యంగా రోడ్డు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. పిసినికాడ గ్రామ సర్పంచ్, కొత్తూరు వైసీపీ నేతలతో పాటు ఉప తహసీల్దార్, మండల పరిషత్ అధికారుల కుట్రతోనే రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ స్థలాలు, రహదారుల నిర్మాణాలపై న్యాయస్థానాల్లో కూడా కేసులు ఉన్నాయన్నారు. వాటిని అధికారులు తప్పుదోవ పట్టించే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. శుక్రవారం న్యాయస్థానం 8 వారాల పాటు ఏ నిర్మాణాలను చేపట్టవద్దని ఉత్తర్వులు ఇచ్చినట్టు స్థానికులు చెప్పారు. ఈ విషయమై వివరణ కోరేందుకు డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోను చేయగా ఆయన అందుబాటులో లేరు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర నిధులు జమ చేయకుంటే కమిషనర్ కార్యాలయం ముట్టడి

పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌రాజు



ఎస్.రాయవరం, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.595 కోట్లను నాలుగు రోజుల్లో స్థానిక సంస్థలకు జమ చేయాలని, లేకుంటే రాజకీయాలకు అతీతంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెండవ విడత రూ. 988 కోట్లు విడుదల చేసిందన్నారు. వీటిలో కేవలం రూ. 393 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగతా నిధులు రూ. 595 కోట్లను దారిమళ్లించిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.8,629 కోట్లను దారి మళ్లించిన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిన మొత్తం నిధులను తిరిగి పంచాయతీ ఖాతాల్లో జమ చేసేంతవరకు పోరాటం చేస్తామని వినోద్ రాజు హెచ్చరించారు.

సింహాద్రి ఎన్‌టీపీసీలో సాంకేతిక లోపం

» నిలిచిపోయిన ఉత్పత్తి

పరవాడ, జనవరి 12: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. ఐదు వందల మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రికల్లా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలి

» కాగ్ సీనియర్ ఆడిటర్ కేఎన్.రాజు పిలుపు

అనకాపల్లి టౌన్, జనవరి 12: స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కేఎన్.రాజు అన్నారు. గౌరీ గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రామకృష్ణ మిషన్ అనుబంధ సంస్థ విశాఖ యువ మహామండలి కార్యనిర్వాహక సభ్యుడు మూర్తి మాట్లాడుతూ మంచి భావనలు మానవాళికి అందించగలిగితే జీవితం వ్యర్థం కాదన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు వెంకటరణ, గౌరీ గ్రంథాలయం ప్రతినిధులు గంగాధర్, ఎం.బాపునాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నేతలైతే ఓకేనా?

» వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోడి పందెం


కోడి పందేలను వీక్షిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఇతర నేతలు

విశాఖపట్నం, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీతో సహా స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. అయితే సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం విశాఖ నగరంలోని మాధవధారలో నిర్వహించిన కోడి పందేలను ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కో-ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు, ఆ పార్టీ సిటీ ప్రెసిడెంట్ కోలా గురువులు దగ్గరుండి వీక్షించారు. నేతలతో కలిసి కోళ్లను ఉత్సాహపరిచేలా సందడి చేశారు. కోడి పందేలు వద్దని పోలీసులు హెచ్చరిస్తుంటే, అధికార పార్టీ నేతలే దగ్గరుండి నిర్వహించడం దేనికి సంకేతమని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆశ్చర్యపోయారు.

20న వేల్పులవీధి గౌరమ్మ జాతర


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జనవరి 12: ప్రఖ్యాతిగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల జాతర మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు చెప్పారు. స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కార్యక్రమాల ప్రతిని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే మెయిన్‌రోడ్డులో గౌరీపరమేశ్వరుల ఆలయంలో ప్రతి రోజూ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. జాతర సందర్భంగా భారీ ఎత్తున విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించామన్నారు. అలాగే భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశామని, 20వ తేదీన అమ్మవారిని ప్రత్యేక రథంపై ఏర్పాటు చేసి పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శీరంశెట్టి నరసింగరావు, వేల్పుల గణేష్, మద్దాల కూర్మారావు, మద్దాల రమణబాబు, బొండా శంకరరావు, దామరౌతు రామారావు, ముమ్మిన సూరిబాబు, నల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి ఊరేగింపు


రాజాధిరాజ వాహనంపై మాఢవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 12: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయానికి ఆనుకుని వున్న స్వామివారి పుష్పతోటలో గోదాదేవి అమ్మవారిని తీసుకెళ్లి నీరాటోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ధూప,దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి హారతులిచ్చారు. ఆలయ అర్చకులు తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. తదుపరి రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాఢవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం బార్ అధ్యక్షుడు డేవిడ్‌కు వైసీపీ అధిష్ఠానం పిలుపు?

» ఆర్థిక స్థితిగతులపై ఆరా


కాండ్రేగుల డేవిడ్

చోడవరం, జనవరి 12: స్థానిక వైసీపీ నాయకుడు, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్‌ను అధిష్ఠానం గురువారం తాడేపల్లి పిలిచి మాట్లాడినట్టు తెలిసింది. అనకాపల్లి స్థానానికి వైసీపీ అభ్యర్థినిగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ సోదరి పిళ్లా రమాకుమారి అభ్యర్థిత్వం ఖరారైనట్టు చెబుతున్నప్పటికీ, ఒకే ఇంట్లో ఇద్దరికి పదవులు ఎందుకన్న ఆలోచనతో మరికొంతమంది పేర్లను పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గవర సామాజిక వర్గానికి చెందిన డేవిడ్ పేరును కొందరు నేతలు సూచించినట్టు సమాచారం. దాంతో తాడేపల్లి పిలిపించి ఆర్థిక స్థోమతతో పాటు ఇతర వివరాలను పార్టీ పెద్దలు అడిగి తెలుసుకున్నట్టు చెబుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఎలమంచిలికి మెరుగైన ర్యాంకు

» రీజియన్‌లో 12.. రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంకు


ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ఎలమంచిలి మునిసిపాలిటీ గతంలో కంటే మెరుగుపడింది. రాష్ట్రస్థాయిలో 47, రీజియన్‌లో 12వ ర్యాంకును సాధించుకుంది. మునిసిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణ, ప్రజా మరుగుదొడ్లు, మార్కెట్లు, పారిశుధ్య నిర్వహణ తీరుపై ర్యాంకులను కేటాయించారు. గతంలో ఎలమంచిలి మునిసిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 112వ ర్యాంకు వచ్చిందని, ఈసారి మెరుగుపడిందని ప్రజారోగ్య శాఖ అధికారి పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మునిసిపాలిటీలో ఇంటింట చెత్త సేకరణ, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ, జిమ్‌లు ఏర్పాటు ఆశించిన విధంగా ఉన్నప్పటికీ డ్రైన్‌లో పూడికతీత పనులు, యానాద్రి కాలువ ఆధునికీకరణకు నోచుకోకపోవడం, వాహనాలకు పార్కింగ్ కేటాయించక పోవడంపై పట్టణ ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

» జిల్లా ఖజానా అధికారి వి.లక్ష్మీసుభాషిణి

అనకాపల్లి రూరల్, జనవరి 12: జిల్లాలో గల ఉప ఖజానాల పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్) ఫిబ్రవరి 29 వరకు స్వీకరిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన, నాన్-ఎంప్లాయిమెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ పింఛనుదారులు జీవన ధ్రువీకరణ నాన్-ఎంప్లాయిమెంట్‌లతో పాటు నాన్-రీమ్యారేజ్ ధ్రువీకరణ పత్రాలు కూడా జత చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానాలు మీ-సేవ కేంద్రాలు, ఇంటర్నెట్ కేంద్రాలు, పోస్టల ద్వారా అందజేయాలని కోరారు. సకాలంలో అందజేయనట్టయితే ఏప్రిల్ నెల పింఛను నిలిపివేస్తామన్నారు.

సీహెచ్‌సీ కాంట్రాక్టు కార్మికుల నిరసన

ఎలమంచిలి, జనవరి 12: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రెండు నెలల వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఏఐటీయూసీ)జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పత్రి వద్ద కార్మికులు వేతన బకాయిలు ఇవ్వాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షునిగా గనిశెట్టి ఏసుదాసు, అధ్యక్షుడిగా తాటిపాకల చిన అప్పారావు, ఉపాధ్యక్షునిగా కె.అప్పలనర్సయ్య, కార్యదర్శిగా సీహెచ్.రత్నం, క్యాషియర్‌గా భాస్కరావులను ఎన్నుకున్నారు.

'రైతులంతా పంట నమోదు చేసుకోవాలి'



కొక్కిరాపల్లిలో మార్పులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఎలమంచిలి, జనవరి 12 : రైతులంతా విధిగా పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి కొక్కిరాపల్లి సమీపంలోని పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్ పడని రైతులుంటే ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏడీఏ రవి ప్రకాష్, ఏవో మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలో పడి పలువురికి గాయాలు



గొయ్యిలో మొక్కను పెడుతున్న స్థానికులు

మునగపాక, జనవరి 12: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో గంగాదేవిపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున భారీ గుంతలో పడి పలువురు గాయపడ్డారు. పెట్రోల్ బంకు ఎదురుగా కల్వర్టు కుంగిపోయి సుమారు ఐదు అడుగుల గుంత ఏర్పడింది. తెల్లవారుజామున ఈ రహదారి గుండా పలు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ గోతిలో పడి వాహనదారులు గాయపడ్డారు. దీంతో గంగాదేవిపేటకు చెందిన సామాజిక కార్యకర్త మొల్లేటి చంద్ర మొక్కను తీసుకువచ్చి గొయ్యిలో పెట్టారు.

వీరమహిళా మండల అధ్యక్షురాలిగా మంగతల్లి



వీర మహిళా కమిటీ సభ్యులను అభినందిస్తున్న విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, జనవరి 12 : జనసేన పార్టీ మండల వీర మహిళా అధ్యక్షురాలిగా గొర్లి మంగతల్లి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు బైలపూడి రామదాసు సమక్షంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా గొర్లి మంగతల్లి, ప్రధాన కార్యదర్శిగా కదిరి సత్యవతి, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, రేఖ రాజు, శరగడం నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్‌ఎస్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనకాపల్లి అగ్రికల్చర్ 12: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం లారెన్స్, మెయో సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మంది ఉద్యోగులు, వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, లారెన్స్ మెయో ప్రతినిధులు గంగూలి, ఆకాశ్, జనార్దనరావు, సాయిశివమూర్తి, ప్రధాన శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, కేవీ రమణమూర్తి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగపరుచుకోవాలి

పరవాడ, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగపరుచుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం రావాడ, కన్నూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం. దివాకర్‌రావు, ఏవో రాంబాబు, బీజేపీ నాయకులు సోమశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేస్తాం : పీలా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 12 : రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే బీసీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి తుమ్మపాలలో జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో బీసీలకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో జగన్‌రెడ్డి రద్దు చేసిన పది శాతం రిజర్వేషన్‌లను పునరుద్ధరిస్తామని చెప్పారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను మోసగించిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, పచ్చికూర రాము, తదితరులు పాల్గొన్నారు.

కాలువలు అధ్వానం

» బోర్లు పనిచేయక ఇబ్బందులు

» ఇది పిళ్లావారి వీధిలో పరిస్థితి

అనకాపల్లి టౌన్, జనవరి 12 : స్థానిక రింగురోడ్డుతో పాటు రోడ్డుకు ఆనుకుని ఉన్న పిళ్లావారివీధిలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిళ్లావారివీధిలోని డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు చోట్ల కాలువల్లో చెత్తా చెదారం, పూడిక పేరుకుపోయాయి. దీంతో నీరు కాలువల్లో ప్రవహించకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఒకచోట రోడ్డుకు సగానికి పైగా చెట్టుకొమ్మలు ఒరిగిపోవడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పిళ్లావారివీధిలోని తాగునీటి బోర్లు సక్రమంగా నీటిని అందించలేని పరిస్థితి నెలకొంది. రెండు బోర్లు ఉన్నప్పటికీ వాటి నుంచి నీరు ఆలస్యంగా వస్తోంది. బోరు ప్లాట్‌ఫారం కూడా దెబ్బతింది. అంతేకాకుండా రింగురోడ్డులోని ప్రధాన కాలువలు చెత్తా చెదారంతో పేరుకుపోయి ఉన్నాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన ఈశ్వరరావు చెబుతున్నారు. ఏది ఏమైనా పిళ్లావారివీధి వాసులు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



రింగురోడ్డులోని కాలువలో పేరుకుపోయిన చెత్త



పిళ్లావారి వీధిలో దెబ్బతిన్న బోరు ప్లాట్‌ఫారం

దీనిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణను వివరణ కోరగా.. పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసిందని, వారితో కాలువలు శుభ్రం చేయిస్తానన్నారు. బోర్లు సక్రమంగా పనిచేయడం లేదన్న విషయం తన దృష్టికి రాలేదని, వాటిని కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

జగనన్నకు చెబుదామంటూ అంగన్‌వాడీలు సంతకాల సేకరణ



ఎస్ రాయవరంలో 32 సంఖ్యగా ఏర్పడిన అంగన్‌వాడీలు



పాయకరావుపేటలో సంతకాల సేకరణ



మునగపాకలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 12 : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజు కొనసాగించారు. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద అంగన్‌వాడీలు రిలే నిరాహారదీక్ష చేశారు. సమస్యలపై జగనన్నకు చెబుదాం అంటూ అంగన్‌వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యూనియన్ జిల్లాప్రధానకార్యదర్శి నాగశేషు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజు శుక్రవారం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, ఎం. రమణి, వై.ఈశ్వరమ్మ, బి. జానకి పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. అంగన్‌వాడీలు శుక్రవారం జగనన్నకు చెబుదాం అంటూ సంతకాలను సేకరించారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి మామిడి తాతాజీ, యూటీఎఫ్ నాయకుడు పి. వెంకట్రావ్ మద్దతు ప్రకటించారు.

రాంబిల్లిలో.. అంగన్‌వాడీల బతుకులతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న ఆందోళన శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దేముడునాయుడు అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు. కోటి సంతకాలు సేకరణలో భాగంగా ప్రముఖులు, పౌరులతో సంతకాలు సేకరించారు.

ఎలమంచిలిలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 32 వ రోజుకు చేరుకుంది. శుక్రవారం మేధావులు, విద్యావేత్తలు, అన్ని వర్గాల ప్రజల సంతకాలను సేకరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌బాబు అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు.

ఎస్.రాయవరంలో.. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు వినూత్నంగా చేశారు. శుక్రవారం తహసీల్దార్ ముందు ఉన్న ప్రధాన రహదారిపై 32 సంఖ్యగా ఏర్పడి నిరసన తెలిపారు.

కోటవురట్లలో.. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా శిబిరంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. చిన్నమ్మలు మాట్లాడుతూ.. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

పాయకరావుపేటలో.. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శుక్రవారం సంతకాలు సేకరించారు. అలాగే శుక్రవారం నాటికి సమ్మె 32 రోజులు కావడంతో 32 ఆకారంలో కూర్చొని ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర యూనియన్ చేపట్టిన జగనన్నకు చెబుదాం పేరుతో సంతకాలు సేకరించారు.

మునగపాకలో.. అంగన్‌వాడీలు శుక్రవారం కోటి సంతకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరు చేపట్టిన సమ్మె 32 రోజులకు చేరుకున్న సందర్భంగా 32గా ఏర్పడి నిరసన తెలిపారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ ఖండించారు. అంగన్‌వాడీల సమ్మె 32వ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



అనకాపల్లిలో వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 12 : పట్టణంలో వాడవాడలా స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వివేకానంద హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వివేకానందుని చిత్రపటానికి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గాంధీనగరం వద్ద వివేకానందుని విగ్రహానికి వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే గొల్లవీధిలోని వివేకానంద విగ్రహానికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక కరణాల వీధిలో స్వామి వివేకానంద విగ్రహానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ హాల్‌లో అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివేకానందుని చిత్రపటానికి పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య జ్యోతి ప్రజ్వలన చేశారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి పట్టణంలోని కరణాలవీధి స్వామి వివేకానంద జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, జబర్దస్త్ ఆర్టిస్టు సత్తిపండు, నాయకులు కర్రి బాబి, నడిపల్లి గణేష్, మాదేటి రామునాయుడు, పీలా బుజ్జి పాల్గొన్నారు.

కొత్తూరులో.. అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలోని కనకదుర్గ ఆలయం వద్ద స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు మేడిశెట్టి సత్తిబాబు, దుద్దు శ్రీనివాసరావు, కోరుకొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో.. స్థానిక మెయిన్‌రోడ్డులో స్వామి వివేకానంద జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

పరవాడలో.. నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు సోమశేఖర్, రవి, పుష్పమిత్ర పేర్కొన్నారు. శుక్రవారం ముత్యాలమ్మపాలెం మాధవస్వామి ఆలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాజేంద్ర, కొండబాబు, చుక్క కృష్ణ, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. వివేకానందుడు దేశ కీర్తి, ప్రతిష్ఠలను చిన్నతనంలోనే ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు వివేకానందుడని ఎంఈవో కె.నరేశ్ అన్నారు. శుక్రవారం ఎంఆర్‌సీ భవనంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ ఎస్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని రేవుపోలవరంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మెరైన్ సీఐ నారీమణి, ఏపీ మత్స్యకార జేఏసీ అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గులు, వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణ, బంగారుచిట్టి, శ్రీను, ముసిలి పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. మండలంలోని పూడిమడకలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా యూత్ అధ్యక్ష, కార్యదర్శులు చోడిపిల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుప్పట్లు, పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేరుగు రవి ప్రసాద్, దాసరి శ్రీను, మేరుగు బాపునాయుడు, చేపల కృష్ణ, యూత్ సభ్యులు మేరుగు అప్పలరాజు, మేరుగు నూకయ్య పాల్గొన్నారు.

మునగపాకలో.. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తోటాడ జడ్పీ హైస్కూలులో యువజన ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగుళూరి రామకృష్ణ, వీర అప్పారావు, స్వామీజీ, శంకర్, జగన్నాథం, నాగమణి పాల్గొన్నారు.



అనకాపల్లిలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్



అనకాపల్లిలో వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసిన ఎంపీ సత్యవతి



అనకాపల్లిలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసిన బీజేపీ నాయకులు

నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు

అనకాపల్లి టౌన్, జనవరి 12 : స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమావాస్య పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు దేవీ హోమం నిర్వహించారు. ఆదిబాబు అమావాస్య యూత్ సభ్యులు అమ్మవారికి పాలు, పసుపు, కుంకుమ, పళ్ల రసాలు, గంధంతో అభిషేకాలు నిర్వహించి, అమావాస్య ఉపారం సమర్పించారు. అలాగే కంభంపాటి భాను కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పిండివంటలతో నైవేద్యం పెట్టారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ఎస్‌ఐ సత్యనారాయణ, వ్యాపారవేత్త పిళ్లా రాజా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ శంకుస్థాపన

అనకాపల్లి టౌన్, జనవరి 12: పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం రాత్రి అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి శ్రీకారం చుట్టారు. గాంధీనగరం అంజయ్యకాలనీ ఎస్సీ హాస్టల్‌ను రూ.25 లక్షలు, బీసీ హాస్టల్‌ను రూ. 20లక్షల ఎంపీ నిధులతో ఆధునికీకరణ చేసేందుకు ఎంపీ శంకుస్థాపన చేశారు. అలాగే విద్యుత్‌నగర్‌లో రూ.30 లక్షలతో ముదిరాజ్ సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పథకాలందాలి

నక్కపల్లి, జనవరి 12: అర్హత వున్న ప్రతీ రైతుకు రైతు భరోసా, పీఎం కిసాన్ సాయమందేలా ఆర్‌బీకే సిబ్బంది శ్రద్ధ కనబర్చాలని వైస్ ఎంపీపీ వీసం నానాజీ చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీకే సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో వుండాలని, సకాలంలో వారికి సలహాలివ్వాలని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

పాయకరావుపేట, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మేజర్ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ గారా ఉషశ్రీ శుక్రవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 107 మంది ఉద్యోగులకు దుస్తులు, టవల్, సబ్బులు, చెప్పులు, ఇతక వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జగతా శ్రీనివాస్, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, పి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అనకాపల్లి టౌన్, జనవరి 12 : ఓటరు నమోదు అవగాహనలో భాగంగా రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి మాదేటి భానుశ్రీ (తుమ్మపాల), ద్వితీయ బహుమతి (కశింకోట బీఎల్‌వో), తృతీయ బహుమతి అనకాపల్లికి చెందిన బి.లక్ష్మి గెలుచుకున్నారని తెలిపారు. ముగ్గుల పోటీలను ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధర్ తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు.

డైట్‌లో సంక్రాంతి సంబరాలు



భోగిమంటల్లో పాల్గొన్న రత్నాకర్ దంపతులు, విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జనవరి 12 : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతిని ప్రతిబింబించే రంగవల్లులు అందరినీ ఆకర్షించాయి. విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. కళాశాల ప్రాంగణంలో పల్లె వాతావరణం తలపించేలా నిర్మించిన తాటాకుఇల్లు, ఎద్దులబండి, గంగిరెద్దుల వేషధారణ, హరిదాసుల వేషధారణ, బొమ్మల కొలువు, పాడిపంటల ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. భోగిమంటలు, వివిధ రకాల పిండి వంటల ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, దాడి పద్మావతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. సుజాత, డీన్ అడ్మిన్ కె.ఈశ్వరరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డీవీఎన్ కళాశాలలో.. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ ఆధ్వర్యంలో భోగిమంటలు, రంగోళి, పతంగులు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు.

పోస్టల్ పథకాలపై గ్రామాల్లో ప్రచారం

రాంబిల్లి, జనవరి 12 : గ్రామాల్లో పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ఎలమంచిలి సర్కిల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం రజాలలో పోస్టల్ పథకాలపై సిబ్బంది ప్రచారం చేశారు. కార్యక్రమంలో రజాల సర్పంచ్ కె.వరలక్ష్మి, మురకాడ బ్రాంచ్ పోస్టుమాస్టర్ బి.వెంకటరమణ, పోస్టుమేన్ రెడ్డి, డీవీ సన్నయ్య పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే ప్రజారంజక పాలన'

ఎలమంచిలి, జనవరి 12: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ప్రజారంజక పాలన సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీ నాగేంద్రకాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవి, సాగర్ హుస్సేన్, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.

హెరిటేజ్ పాడి రైతులకు బోనస్ పంపిణీ

అచ్యుతాపురం రూరల్, జనవరి 12 : మండలంలోని కొండకర్ల పరిధిలో హెరిటేజ్ పాడి రైతులకు శుక్రవారం డెయిరీ మేనేజరు కూండ్రపు శేష సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. 26 మంది పాడి రైతులకు రూ.2.15 లక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బి.జగ్గారావు, బి.ప్రకాశరావు, బి.కుమార్, కె.శ్రీను, జి.రమణాజీ, బి.శివ, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన సింహాచలానికి భక్తబృందం

మునగపాక, జనవరి 12 : మండలంలోని వాడ్రాపల్లిలో నరసింహస్వామి మాలధారణ భక్తులు శుక్రవారం కాలినడకన సింహాచలం బయలుదేరారు. సింహాద్రప్పన్న చిత్రపటాలతో తోడుపెద్దు సేవలతో స్వామి కీర్తనలు పాడుకుంటూ బయలుదేరారు. వీరికి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు వీడ్కోలు పలికారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

కశింకోట, జనవరి 12 : మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సచివాలయ సిబ్బంది, సర్పంచులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ కలగ లక్ష్మి పంచాయతీల్లో అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రోజారాణి, ఎంపీడీవో రవికుమార్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలను నిర్వహించాలి

రాంబిల్లి, జనవరి 12 : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించాలని బీసీటీ కార్యదర్శి బి.శ్రీరామమూర్తి అన్నారు. శుక్రవారం హరిపురంలో భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో 67 గ్రామాల కార్యాచరణ కమిటీ సభ్యులతో సంక్రాంతి సంబరాల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీటీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు బీవీ పరమేశ్వరరావు సతీమణి కల్యాణి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, బీసీటీ ప్రతినిధి సీతారామరాజు పాల్గొన్నారు.

షుగర్ పెరుగుతోంది

... 5వ పేజీ తరువాయి

పోలిస్తే మహిళలు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం, ఇతర జాగ్రత్తలను పాటించడంలో శ్రద్ధ వహిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి..

కేజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగానికి వస్తున్న వారిలో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలవారు ఉంటున్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్ల కోసం 30 పడకలతో ప్రత్యేక వార్డు అందుబాటులో ఉంది.

కారణాలు ఇవే..

జన్యుపరమైన కారణాలు, హార్మోన్ల అసమతుల్యతతో పాటు కొవిడ్ తరువాత శారీరక శ్రమ తగ్గడం, ఉద్యోగ భద్రత, ఆర్థికపరమైన ఇబ్బందులతో తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, మారిన ఆహారపు అలవాట్లు, సమయానికి నిద్రలేక పోవడం వంటివి షుగర్ రావడానికి కారణమవుతున్నాయి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఉరుకులు, పరుగులు జీవితాలతో అనేక అనారోగ్య సమస్యల మాదిరిగానే షుగర్‌ను తెచ్చు కుంటున్నారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. ఇప్పుడు 20 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. కొవిడ్ వైరస్ వ్యాప్తి తరువాత బాధితుల సంఖ్య పెరిగింది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండడం, సమయానికి నిద్రపోవడం, శారీరక వ్యాయామం...ఈ నాలుగింటిపై దృష్టిసారిస్తే 90 శాతం షుగర్ దరిదాపుల్లోకి రాదు. కానీ, ఉద్యోగం, వ్యాపారం అంటూ పరుగులు పెడుతుండడం వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఆడుకునేందుకు గ్రౌండ్ లేకపోవడంతో పీడియాట్రిక్ డయాబెటిస్ కనిపిస్తోంది. 0.5 శాతం మంది చిన్నారుల్లో ఈ సమస్య ఉంటోంది.

జనావాసాల మధ్య మద్యం దుకాణం

... 5వ పేజీ తరువాయి

నడవాలంటేనే భయపడిపోతున్నారు. పైగా మందు బాబులు తమలో తాము గొడవపడి కేకలు వేసుకుంటూ వుంటారు. దీంతో మద్యం దుకాణాన్ని వేరేచోటుకు మార్చాలని స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ పట్టించుకోలేదు. ఆ నేపథ్యంలో గురువారం రాత్రి మద్యం దుకాణం వద్ద పోలీసులకు, మందుబాబులకు మధ్య తలెత్తిన ఘర్షణ వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చినబజారు వీధిలోని మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని మరోసారి డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు, మత సంబంధమైన ప్రార్థనా మందిరాలకు సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకూడదు. కానీ చోడవరం చినబజారువీధిలో గుడితో పాటు, జాతిపిత గాంధీజీ విగ్రహానికి అతి సమీపంలో మద్యం దుకాణాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణం కావడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. స్థానికుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు. పోలీసులు సైతం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గాంధీబొమ్మ సెంటరు వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని వేరే ప్రదేశానికి తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీకి పండుగ తాకిడి

» రద్దీగా మారిన కాంప్లెక్స్ » సుదూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ కాంప్లెక్స్

నర్సీపట్నం, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారితో ఆర్టీసీకి తాకిడి పెరిగింది. విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ఇవ్వడం, శనివారం నుంచి సోమవారం వరకు వరస సెలవులు రావడంతో ఉద్యోగం, వ్యాపారం, కూలి పనులు చేసేకునే వారు సొంత ఊళ్లకు వెళుతున్నారు. దీంతో నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రయాణికుల రద్దీ పెరిగింది. అధికారులు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు, అదనపు సర్వీసులు నడుపుతున్నారు. ఈ నెల 11 నుంచి 18 తేదీ వరకు అదనపు బస్సులు నడుపుతున్నామని, నర్సీపట్నం నుంచి తిరుగు ప్రయాణం అయ్యే వారి కోసం ఈ నెల 16వ తేదీ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని అధికారులు తెలిపారు. విజయవాడకు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. నర్సీపట్నం- విశాఖపట్నం రూట్లో ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. రాజమండ్రి, విశాఖపట్నంకు అదనపు బస్సులు వేశారు. తుని రూట్లో 12 బస్సులు తిరుగుతుండగా అదనంగా మరో రెండు బస్సులు తిప్పుతున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ఆయా రూట్లో అదనపు బస్సులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని డిపో మేనేజర్ ధీరజ్ చెప్పారు.

ఘనంగా మేలుకొలుపు బృందాల సమ్మేళనం


ప్రసంగిస్తున్న కమలానంద భారతి స్వామీజీ

రావికమతం, జనవరి 12 : మండలంలోని పిల్లవానిపాలెంలో శుక్రవారం మేలుకొలుపు బృందాల మహా సమ్మేళనాన్ని నిర్వహించారు. నెలగంట పెట్టింది మొదలు గ్రామ గ్రామాన హరికీర్తనలు, రామ భజనలు చేస్తూ వచ్చిన భజన బృందాలు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఇందులో భాగంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి గన్నవరం భువనేశ్వరీదేవి పీఠం నిర్వాహకులు కమలానంద భారతి స్వామిజీ విచ్చేసి సనాతన ధర్మం గురించి వివరించారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం

... 5వ పేజీ తరువాయి

నడవాలంటేనే భయపడిపోతున్నారు. పైగా మందుబాబులు తమలో తాము గొడవపడి కేకలు వేసుకుంటూ వుంటారు. దీంతో మద్యం దుకాణాన్ని వేరేచోటుకు మార్చాలని స్థానికులు పలుమారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ పట్టించుకోలేదు. ఆ నేపథ్యంలో గురువారం రాత్రి మద్యం దుకాణం వద్ద పోలీసులకు, మందుబాబులకు మధ్య తలెత్తిన ఘర్షణ వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చినబజారువీధిలోని మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని మరోసారి డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం విద్యా సంస్థలు, మత సంబంధమైన ప్రార్థనా మందిరాలకు సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకూడదు. కానీ చోడవరం చినబజారు వీధిలో గుడితో పాటు, జాతిపిత గాంధీజీ విగ్రహానికి అతి సమీపంలో మద్యం దుకాణాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణం కావడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. స్థానికుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు. పోలీసులు సైతం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గాంధీబొమ్మ సెంటరు వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని వేరే ప్రదేశానికి తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

షుగర్ పెరుగుతోంది

... 5వ పేజీ తరువాయి

పోలిస్తే మహిళలు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం, ఇతర జాగ్రత్తలను పాటించడంలో శ్రద్ధ వహిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి..

కేజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగానికి వస్తున్న వారిలో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, ఒడిశా, చత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలవారు ఉంటున్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్ల కోసం 30 పడకలతో ప్రత్యేక వార్డు అందుబాటులో ఉంది.

కారణాలు ఇవే..

జన్యుపరమైన కారణాలు, హార్మోన్ల అసమతుల్యతతో పాటు కొవిడ్ తరువాత శారీరక శ్రమ తగ్గడం, ఉద్యోగ భద్రత, ఆర్థికపరమైన ఇబ్బందులతో తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, మారిన ఆహారపు అలవాట్లు, సమయానికి నిద్రలేకపోవడం వంటివి షుగర్ రావడానికి కారణమవు తున్నాయి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవ డంతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

- డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఉరుకులు, పరుగులు జీవితాలతో అనేక అనారోగ్య సమస్యల మాదిరిగానే షుగర్‌ను తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే షుగర్ వచ్చేది. ఇప్పుడు 20 ఏళ్ల వారిలోనూ కనిపిస్తోంది. కొవిడ్ వైరస్ వ్యాప్తి తరువాత బాధితుల సంఖ్య పెరిగింది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండడం, సమయానికి నిద్రపోవడం, శారీరక వ్యాయామం...ఈ నాలుగింటిపై దృష్టిసారిస్తే 90 శాతం షుగర్ దరిదాపుల్లోకి రాదు. కానీ, ఉద్యోగం, వ్యాపారం అంటూ పరుగులు పెడుతుండడం వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఆడుకునేందుకు గ్రౌండ్ లేకపోవడంతో పీడియాట్రిక్ డయాబెటిస్ కనిపిస్తోంది. 0.5 శాతం మంది చిన్నారుల్లో ఈ సమస్య ఉంటోంది.

సంక్రాంతిలోగా స్పందించకుంటే సమ్మె ఉధృతం

» ప్రభుత్వానికి అంగన్‌వాడీ కార్యకర్తలు హెచ్చరిక » దీక్షా శిబిరాల వద్ద సంతకాల సేకరణ » పలు ప్రజా సంఘాల నాయకుల మద్దతు


గొలుగొండలో రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు


మాడుగులలో అంగన్‌వాడీలకు పలువురు మద్దతు

బుచ్చెయ్యపేట, జనవరి 12 : డిమాండ్ల సాధనకు ఆందోళనకు దిగిన అంగన్‌వాడీలు శుక్రవారం ఇక్కడ సంతకాల సేకరణ చేపట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని 32 రోజులుగా నిరసన తెలియజేస్తున్నా జగన్ సర్కారులో స్పందన లేకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా ఎస్మా ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. సంక్రాంతి పండగలోపు తమ పదకొండు సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో అంగన్‌వాడీల మండల సంఘం ప్రతినిధులు కోవెల వెంకటలక్ష్మి, ఎలిశెట్టి అమ్మాజీ, ఆది వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో భాగంగా శుక్రవారం ఇక్కడ సంతకాల సేకరణ చేపట్టారు. తొలుత గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీలు ఇక్కడ సమావేశమై నిరసన తెలియజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. సంతకాలను సేకరించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పంపనున్నట్టు యూనియన్ నాయకురాళ్లు మంగతాయారు, భ్రమరాంబ తదితరులు తెలిపారు.

మాడుగుల : అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధనకు సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ రూపాల్లో ప్రభుత్వానికి నిరసనను తెలియజేస్తున్నారు. శుక్రవారం ఇక్కడి దీక్షా శిబిరానికి స్థానిక న్యాయవాది శ్రీనాథప్రసాదరావు విచ్చేసి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పైగా ఎస్మా ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం అంగన్‌వాడీలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీల సమ్మెకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి శుక్రవారం ఇక్కడ సంఘీభావం తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం నియోజవర్గంలో ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆ తరువాత ఎన్టీఆర్ మినీస్టేడియంలో రిలేదీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు, నాయకులు ఎన్.చిరంజీవి, వాడపల్లి సంజీవ్, కొల్లు గంగాధర్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా కె.కోటపాడు మండల సమావేశం

» సమస్యలపై ప్రశ్నించే వారు కరువు » చాలామంది ప్రజాప్రతినిధులు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగ విజయలక్ష్మి

కె.కోటపాడు, జనవరి 12 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం శుక్రవారం మొక్కుబడిగా సాగింది. మండల ఉపాధ్యక్షురాలు లెక్కల నాగ విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశానికి సభ్యులు కరువయ్యారు. హాజరైన వారిలో సైతం సమస్యలపై గొంతెత్తేవారు లేకపోయారు. దీంతో మ.మ.అనిపించేశారు. చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు రాజేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో రేషన్ సరకుల పంపిణీలో కందిపప్పు పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సరకులు సకాలంలో పూర్తిస్థాయిలో అందేలా చూడాలని కోరారు. దీనిపై తహసీల్దార్ రమేష్ బాబు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా మండలంలో 320 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, 724 మంది రైతులకు నష్టం పరిహారం మంజూరైనట్టు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీటీసీలు వర్రి రామానాయుడు, రొంగలి సూర్యనారాయణ తదితరులతో పాటు పలువురు సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి చంద్రబాబుకు పట్టం కట్టండి

» టీడీపీ శ్రేణుల సమావేశాల్లో కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేష్


చీడిగుమ్మలలో మాట్లాడుతున్న పద్మావతి


నాగాపురంలో మాట్లాడుతున్న రాజేష్

గొలుగొండ, జనవరి 12 : వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, ఈ పరిస్థితుల్లో ప్రజల కష్టాలు తీరాలన్నా.., ఆంధ్ర ప్రగతి పథాన పయనించాలన్నా.. చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. చీడిగుమ్మలలో శుక్రవారం రాత్రి ఏర్పాటైన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. నర్సీపట్నం నియోజకవర్గం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తొంభై శాతం అభివృద్ధి చెందినట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అంతా కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అడగర్ల అప్పలనాయుడు, చీడిగుమ్మల సొసైటీ మాజీ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ, నాయకులు కామిరెడ్డి గోవింద, కె.రవివర్మ, కొల్లి రాంబాబు, సత్యనారాయణ, కర్రి నాయుడు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే అందరి లక్ష్యంనర్సీపట్నం మునిసిపాలిటీ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి సీహెచ్ నాగాపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పా టైన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రచారం చేయాలన్నారు. చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, నాయకులు బొప్పల ప్రసాద్, జగ్గయ్యదొర, వరహాలబాబు, నాగరాజు, వరహాలబాబు పాల్గొన్నారు.

'పథకాల ద్వారా పేదలు ప్రగతి సాధించాలి'


దేవరాపల్లిలో పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి, జనవరి 12 : ప్రభుత్వ పథకాల ద్వారా పేదలంతా ఆర్థిక ప్రగతి సాధించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరాపల్లిలో విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అంతకు ముందు రైవాడతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కర రావు, బూరే బాబూరావు, కర్రి సూరినాయుడు, వేచలపు అప్పలనాయుడు, కె.వీరమణ, మొల్లి కృష్ణమూర్తి, సింహాచలంనాయుడు, లలితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 'జలకళ' మోటార్లు పంపిణీ

బుచ్చెయ్యపేట, జనవరి 12 : జలకళ పథకంలో భాగంగా మండలంలో 40 మంది రైతులకు మంజూరైన పంపు సెట్ల మోటార్లను శుక్రవారం విప్ కరణం ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఎంపీడీవో సువర్ణరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, బంగారుమెట్ట పీఏసీఎస్ చైర్ పర్సన్ సాయం రమేష్, దిబ్బిడి సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్లు విలువైన భూమి స్వాధీనానికి ఎత్తులు

» అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపణ

» వెంటనే అడ్డుకట్ట వేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్ ఫిర్యాదు కాపీ అందిస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, జనవరి 12 : మండల కేంద్రం మాకవరపాలెంలో ఉన్న నాలుగు ఎకరాల సీలింగ్ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు రుత్తల శేషుకుమార్, ఉప సర్పంచ్ లాలం రాము కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మాకవరపాలెంలో 47/5ఏ, 47/5బి, 47/5సి, 47/5డి సర్వే నంబర్లలో ఉన్న నాలుగు ఎకరాల భూమి గతంలో ల్యాండ్ సీలింగ్‌లో ఉందన్నారు. సదురు భూమిపై క్రయ విక్రయాలు జరగరాదన్న ఉద్దేశ్యంతో గతంలోనే ఈ భూమిని రెవెన్యూ అధికారులు వారి ఆధీనంలో పెట్టుకున్నారన్నారు. అయితే డి.పట్టా భూములు జిరాయితీ భూములుగా మార్పు చేయాలంటూ ప్రభుత్వం జీవో మంజూరు చేయడంతో స్థానిక అధికార పార్టీ నాయకులు ఈ భూమిని సొంతం చేసుకునేందుకు గుట్టుగా భూ పట్టాలు తయారు చేస్తున్నట్టు ఆరోపించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.నాలుగు కోట్లు ఉంటుందన్నారు. దీనిపై అధికారులు స్పందించి ఈ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అక్కడా న్యాయం జరగకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

'టీడీపీ గ్రామ సభలు చూసి వైసీపీలో వణుకు'


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వై.పాత్రుడు

మాకవరపాలెం, జనవరి 12 : గ్రామాల్లో టీడీపీ చేపడుతున్న బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి వైసీపీ నాయకుల్లో వణుకు పుడుతోందని, అందువల్లే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు అన్నారు. శుక్రవారం తామరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నాలుగు రోజులుగా గ్రామాల్లో తమ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చేస్తున్న ప్రసంగాలకు ప్రజలనుంచి అనూహ్య స్పందన వస్తున్నట్టు చెప్పారు. ఇవి తట్టుకోలేకే వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

వాడవాడలా వివేకానంద జయంతి


పాతకృష్ణాదేవిపేటలో వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు


చోడవరంలో యువ శాస్త్రవేత్త గంగరాజును సత్కరిస్తున్న దృశ్యం

రోలుగుంట, జనవరి 12 : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటారు. తొలుత తహసీల్దార్ కె.వరహాలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటారు. ఆర్ఐ రామమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : వివేకానందుడు ఆదర్శప్రాయుడని పాతకృష్ణాదేవిపేట యువకులు కొనియాడారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వం పాఠశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమాజానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి, వివేకానంద యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : తిమిరాం రామాలయంలో స్వామి వివేకానంద జయంతిని జరిపారు. సమరసతా సేవా ఫౌండేషన్ సమన్వయకర్త గట్రెడ్డి రాము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వివేకానంద చేసిన సేవలను వివరించారు.

చోడవరం : పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువ శాస్త్రవేత్త గంగరాజును విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ సత్కరించారు. విద్యార్థినులు దేశభక్తిని ప్రబోధించే పాటలను నృత్యాలతో అద్భుతంగా ప్రదర్శించారు. కళాశాల డీన్ ఎస్వీ వాసు, కరస్పాండెంట్ కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వివేకానంద జయంతిని శుక్రవారం అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డాది కేఏడీ జడ్పీ హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, ఆయుర్వేద వైద్యులు సుంకరణం దుర్గేష్‌కుమార్, వడ్డాది వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఏపీపురంలో రేషన్ కందిపప్పు ఇవ్వడం లేదు'

నాతవరం, జనవరి 12 : మండలంలోని ఏపీపురంలో ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేసే వాహనంలో జనవరి నెలకు సంబంధించి సబ్సిడీపై ప్రభుత్వం సరాఫరా చేస్తున్న కందిపప్పును సగానికిపైగా కార్డుదారులకు ఇవ్వలేదని సర్పంచ్ పైల రమేష్ ఆరోపించారు. దీనిపై సదరు సిబ్బందిని ప్రశ్నిస్తే జనవరి నెలకు సంబంధించి అందరికీ సరకు రాలేదని చెపుతున్నారన్నారు. సంక్రాంతి పండగ దృష్ట్యా ఇస్తే కార్డుదారులందరికీ ఇవ్వాలని లేదంటే పూర్తిగా మానేయాలని ఆయన సూచించారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరారు.

అడ్డసరంలో 1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రోలుగుంట, జనవరి 12 : అడ్డసరం గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం దాడులు జరిపినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఇందులో భాగంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్ని జిమ్మిక్కులు చేసినా అధికారం వైసీపీదే'

నర్సీపట్నం, జనవరి 12 : టీడీపీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం తథ్యమని ఎమ్మెల్యే గణేశ్ అన్నారు. సోషల్ మీడియా పోస్టుల వివాదంపై పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులను కొంత మంది గంజాయి వ్యాపారులు బెదిరిస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చామన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవిద్య'లో ఉత్సాహంగా ఫేర్ వెల్ డే


డ్యాన్స్‌లతో అలరిస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం, జనవరి 12 : ఇక్కడి శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఎస్ఐ సుధాకరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. డిగ్రీ తర్వాత పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ బోళెం దొరబాబు, ప్రిన్సిపాల్ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

జేబీపురంలో 220 మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, జనవరి 12 : జేబీపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మ ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు డాక్టర్ తరణి, నరేష్, సంతోష్, స్వర్ణలతలు 220మందికి తనిఖీలు జరిపి, అవసరమైన మందులు అందజేశారు. ఎంపీడీవో జయప్రకాశరావు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్‌లు సేవలు అందించారు.

'అవంతి'లో ఘనంగా సంక్రాంతి సంబరాలు


వేడుకల్లో గంగిరెద్దు ప్రదర్శనను వీక్షిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం, జనవరి 12 : మండలంలోని తామరంలో గల అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మైదానంలో అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, భోగి మంట ఇలా కోలాహల వాతావరణం నెలకొంది. విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకకు మరింత వన్నెతెచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఏవో డానియేల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలతో సాగు ఖర్చు ఆదా



మాట్లాడుతున్న సహాయ సంచాలకులు జగన్నాథరావు

చీడికాడ, జనవరి 12 : ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. ఖండివరంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన రైతు వ్యవసాయ పరిశోధనా సదస్సులో మాట్లాడారు. ప్రస్తుతం కూలీల కొరత ఉన్నందున ఆధునిక పనిముట్లు వినియోగించుకొని వ్యవసాయం చేయాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను వాడకుండా సేంద్రీయ ఎరువులను వాడితే ఆరోగ్యవంతమైన పంటలు పండుతాయన్నారు. సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్ర, నైరా కళాశాల అసోసియేట్ డీఎస్ డా.శ్రీనివాస్, వ్యవసాయ కళాశాల సిబ్బంది మోసే, మాజీ ఉప సర్పంచ్ సుంకర శ్రీనివాసరావు, సింగంపల్లి పెదనాయుడు ,నైరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌పీని నియమించాలని కూలీల ఆందోళన


రోడ్డుపై బైఠాయించిన ఉపాధి కూలీలు

రావికమతం, జనవరి 12 : కొట్నాబిల్లి పంచాయతీ ఆదివాసీలు శుక్రవారం తమ పంచాయతీకి ఉపాధి వీఆర్‌పీని నియమించాలంటూ ఖాళీ గంపలు నెత్తిన పెట్టుకొని, రోడ్డుపై బఠాయించి నినాదాలు చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా కొట్నాబిల్లిలో వీఆర్‌పీ లేక ఇక్కడ ఉపాధి కూలీలకు సక్రమంగా పనులు లేవన్నారు. గిరిజన గ్రామాల్లో ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టాదారులకు 150 రోజులు పని దినాలు కల్పించాలని, జీడిమామిడి తోటల్లో కలుపు తొలగించేందుకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గోరా పెద్దిరాజు, గిరిజన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.